# విద్యా సంస్థల్లో బతుకమ్మ సంబురాలు





వైరాటౌన్: బతుకమ్మకు పూజలు చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్, కరస్పాండెంట్ భూమేశ్‌రావు, కుర్రా సుమన్, బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

వైరాటౌన్, అక్టోబర్12: తెలంగాణకు తలమానికంగా నిలిచే బతుకమ్మ పండుగ సంబురాలను గురువారం వైరా న్యూలిటిల్ ఫ్లవర్స్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు భారీ బతుకమ్మను రకరకాల పూలతో పేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆడిపాడారు. వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైరా రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాఠశాల కరస్పాండెంట్ భూమేశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ అంటేనే బతుకమ్మ, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం బతుకమ్మ పండుగ అన్నారు. అశ్వీజ మాస శుద్ధ పాఢ్యమి నాడు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మతో బతుకమ్మ సంబురాలు ముగుస్తాయన్నారు. బతుకమ్మ పండుగ రాష్ట్ర పండుగగా నిర్వహించుకుంటూ దేశవిదేశాల్లో కూడా నిర్వహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో కాపా మురళీకృష్ణ, లగడపాటి ప్రభాకర్‌రావు, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వైరా రూరల్‌లో..**

వైరారూరల్, అక్టోబర్ 12: ప్రపంచంలోనే అతిపెద్ద పూల పండుగ బతుకమ్మ పండుగ అని, ఈ పండుగకు సైన్స్ పరంగాను శాస్త్రీయత పరంగాను పూర్వకాలం నుంచి ప్రత్యేక గుర్తింపు పొందిందని లయన్స్‌క్లబ్ వైరా అధ్యక్షులు పెనుగొండ ఉపేంద్రరావు అన్నారు. మండలంలోని ఖానాపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బతుకమ్మ పోటీలు నిర్వహించి నంబూరు రామారావు, శ్రీదేవి దంపతుల సహకారంతో, పాఠశాల వారి ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గంజినబోయిన రామకృష్ణ, క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు, సభ్యులు సృజన, చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, వీ బిక్షారావు, షేక్ జరీనా, బీ రాము, విద్యా కమిటీ చైర్మన్ షేక్ నస్రీన్, గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాణాప్రతాప్‌కు రైతు నేస్తం అవార్డు



వైరాటౌన్, అక్టోబర్12: మండలంలోని వల్లాపురం గ్రామానికి చెందిన తుమ్మల రాణాప్రతాప్ రైతునేస్తం అవార్డుకు ఎంపికయ్యారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రీసెర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ అడ్వైజరీ కౌన్సిల్ మెంబర్ పద్మశ్రీ ఐవీ సుబ్బారావు పేరున మాజీ ఉప రాష్ట్రపతి ముప్పారపు వెంకయ్యానాయుడు ట్రస్ట్, పద్మశ్రీ ట్రస్ట్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలుగు రాష్ట్రాల రైతులకు ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మకమైన రైతునేస్తం బెస్ట్ ఇన్నోవేషన్ ఫార్మర్ అవార్డును రాణాప్రతాప్‌కు ప్రకటించారు. ఈ నెల14న గన్నవరం స్వర్ణభారతి ట్రస్ట్ భవన్‌లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు చేతుల మీదుగా అవార్డును అందుకుంటానని తెలిపారు. గతంలో రాణాప్రతాప్‌కు రైతురత్న, ఏరువాక, దక్షిణ భారత బెస్ట్ ఇన్నోవేషన్ ఆలిండియా, బెస్ట్ ఇన్నోవేషన్ లక్నోలో జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక అవార్డులను అందుకున్నారు. ఈ అవార్డు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్ట్ ఏర్పాటు




చెక్‌పోస్ట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రెహమాన్

వైరారూరల్, అక్టోబర్12: అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు నెమలి, దాచాపురం, గన్నవరం క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను గురువారం మధ్యాహ్నం వైరా ఏసీపీ రెహమాన్, వైరా ఎస్సై మేడా ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా చెక్‌పోస్ట్‌ను ఏర్పాటు చేశామని, మద్యం, డబ్బు, ఇతర అక్రమ రవాణా అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రా నుంచి తెలంగాణ మీదుగా వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని, సరైన ఆధారాలు లేకుండా రూ.50వేలు కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లినట్లయితే సీజ్ చేస్తామని పేర్కొన్నారు. అత్యవసర సేవలైన వైద్యం, కళాశాల ఫీజు, వ్యాపారం, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు డబ్బును తీసుకెళ్తున్న వారు సరైన పత్రాలతో డబ్బును తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అందరూ పాటిస్తూ ప్రజలు పోలీసులకు సహకరించాలని ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎస్సై మేడా ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమన్వయంతో విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

మణుగూరు టౌన్, అక్టోబర్ 12: అధికారులంతా సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని పినపాక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలు, ప్రచారాలపై మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటి నిఘా పెట్టాలని అన్నారు. నోడల్ అధికారి మణుగూరు డీఎస్పీ రాఘవేంద్రరావు మాట్లాడుతూ నియోజక వర్గంలోని మండలాల్లో రాజకీయ పార్టీల బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు ఉంటే తొలగించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించేవారి వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉంటే తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పోలీస్ శాఖా అధికారులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

### అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్

కారేపల్లి, అక్టోబర్12: మండలంలోని మాణిక్యారం, ఎర్రబోడు, గాదెపాడు, చీమలపాడు, బాబు, మల్లాయగూడెం, బోటితండా, పాటి మీద గుంపు, జైత్రాం తండా, రేలకాయలపల్లి గ్రామాల్లోని 13 పోలింగ్ కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పాఠశాలల వద్ద టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉన్నాయని, పోలింగ్ కేంద్రాల వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని, ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఓటరుకు మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ వంకాయల సురేశ్, ఎంపీడీవో ఎం చంద్రశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్

# బోనకల్ వృద్ధాశ్రమ వృద్ధులకు కంటి ఆపరేషన్లు

వైరాటౌన్, అక్టోబర్12: లయన్స్ కంటి హాస్పిటల్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ ఆధ్వర్యంలో బోనకల్ వృద్ధాశ్రమ వృద్ధులకు గురువారం ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ సమాంలో వృద్ధులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరంతర సేవలు కొనసాగుతాయన్నారు. ని, జ్ఞానేంద్రియాలు నయనం ప్రధానమని, వృద్ధాప్యంలో కళ్లు కానరాకపోవడం పెద్ద సమస్యగా వృద్ధులకు ఉంటుందని, వాటిని తీర్చేందుకు ముందుకు వచ్చిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వుంద్రు శ్యామ్ బాబు, వుంద్రు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.




కంటి ఆపరేషన్లు చేయించుకున్న వృద్ధాశ్రమం వృద్ధులు

## ఎస్సీ వర్గీకరణలో మాట తప్పిన బీజేపీ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వైరారూరల్, అక్టోబర్12: బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో వర్గీకరణ చేస్తానని చెప్పిన బీజేపీ మాట తప్పి మోసం చేసిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు లంకా వెంకటేశ్వర్లు, ఎల్‌వీఆర్ అన్నారు. మండలంలోని కేజీ సిరిపురం గ్రామంలో గురువారం చలో హైదరాబాద్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ వచ్చే పార్లమెంటు సమావేశంలో అయినా ఎస్సీ వర్గీకరణ చేయాలని, లేనట్లయితే బీజేపీ నాయకులను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడిశాల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి అయినాల కనకరత్నం, నారపోగు నర్సింహారావు, మాతెపోగు నవీన్, అయినాల సుధాకర్, నారపోగు నాగకృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ కూసింది.. పంపిణీకి బ్రేక్ పడింది

కొత్తగూడెం అర్బన్, అక్టోబర్ 12: ఎన్నికల కోడ్ అమలు కారణంగా ఆడపడుచులకు బతుకమ్మ చీరెల పంపిణీ నిలిచిపోయింది. చీరెల పంపిణీని నిలిపివేయాలని గురువారం మధ్యాహ్నం ఎన్నికల అధికారి ఆదేశాలిచ్చారు. దీనిని జిల్లా అధికారులు వెంటనే అమలు చేశారు. కొత్తగూడెం నియోజకవర్గంలో 95,553 మందికిగాను ఇప్పటికే 68,990 (దాదాపు 72 శాతం) చీరెల పంపిణీ పూర్తయింది. ఇప్పటికే 70 శాతానికి పైగా పంపిణీ చేసినట్లు మెప్మా జిల్లా కో-ఆర్డినేటర్ రాజేష్ చెప్పారు. మొదటి విడతలో వచ్చిన 74,540 చీరెలలో 68,990 పంపిణీ చేసినట్లు, గోడౌన్‌లో 5,550 ఉన్నట్లు వివరించారు.

## మెరిట్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

అశ్వారావుపేట, అక్టోబర్ 12: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదివిన ఇద్దరు విద్యార్థులు మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో ఎంపీపీసీ సెకండియర్ చదివిన టీ చైతన్య, హెచ్ఈసీ సెకండీయర్ చదివిన కే నాగలక్ష్మి ఎంపికయ్యారని తెలిపారు. వీరు డిగ్రీ చదువుతుండగా ఇంటర్ సెకండీయర్ నుంచి ఈ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఇంటర్‌లో రూ.10 వేలు, డిగ్రీలో ప్రతి ఏడాదికి రూ. 20 వేలు, పీజీ ఏడాదికి రూ. 30 వేలు ప్రభుత్వం విద్యార్థుల చదువునిమిత్తం చెల్లిస్తుందన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని తోటి విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. విద్యార్థులను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

## జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దు

అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 12: జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారి ప్రియాంక అన్నారు. గురువారం మండలంలోని శాంతినగర్ గ్రామ శివారులోని గొత్తి కోయల గ్రామంలో ఎర్రగుంట ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ప్రియాంక జ్వర పీడీతులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు వల్ల అనేక వ్యాధులు ప్రబలుతాయని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కాచి వడపోసిన నీటిని మాత్రమే తాగాలని, గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలలో కాన్పులు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటు నమోదుపై ప్రచారం

కారేపల్లి, అక్టోబర్12: త్వరలో జరుగనున్న ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలనే లక్ష్యంలో భాగంగా మండలంలో నోడల్ అధికారి ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఓటు నమోదుపై ప్రచారం చేస్తున్నారు. గురువారం కారేపల్లిలో పంచాయతీ సిబ్బంది కరపత్రాలు పంపిణీ చేశారు. ఓటరు తమ ఓటర్ ఐడీ, ఎన్నికల్లో ఓటు వేసే పోలింగ్ స్టేషన్ తెలుసుకునేందుకు అవసరమైన యాప్ అందరికీ అందుబాటులో ఉందన్నారు.